ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
గురువారం 25 సెప్టెంబరు 2025



నేడు గూడెం సత్యదేవుడి ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెంగుట్ట రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో స్వామివారి హుండీని గురువారం లెక్కిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ఈవో, ఆలయ ముఖ్య అర్చకులు, సిబ్బంది, అర్చకుల పర్యవేక్షణలో ఉదయం 10గంటలకు హుండీ లెక్కిస్తామని తెలిపారు.

చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి సాయికుంటలోని దగ్గుబాటి వెంకట రాహుల్ ఇంట్లో రెండు వేల రూపాయల నగదు, ఓ ఫోన్‌ను చోరీ చూశారు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో కలెక్టర్ కార్యాలయం గోదావరి రోడ్డులో దొంగతనం చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న వాహనాన్ని చూసి నిందితులు రైల్వేట్రాక్ వెంబడి పారిపోయారు. చున్నంబట్టి ఏరియాలో సైతం చెడ్డీగ్యాంగ్ దొంగతనానికి యత్నించినట్లు సమాచారం. నిందితులకోసం మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. నస్పూర్, మంచిర్యాలలో చోరీ జరిగినట్లు సమాచారం. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. చెడ్డీ గ్యాంగ్‌తో జిల్లా కేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు గానీ లేదీ 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

పత్తి కొనుగోళ్లకు సమాయత్తం..



- జిల్లాలో 11 సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు
- నవంబరు మొదటివారంలో ప్రారంభంకానున్న కొనుగోళ్లు
- గత ఏడాదితో పోల్చితే దిగుబడి తగ్గుతుందని అంచనా
- అతివృష్టి, యూరియా కొరతే కారణం
- మద్దతు ధరపైనా రైతుల అసంతృప్తి

మంచిర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. సీసీఐ ద్వారా జిల్లాలో ఈ సీజన్‌లో మొత్తం 11 సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. తాండూరు మండలంలో నాలుగు, చెన్నూరులో ఆరు, లక్షెట్టిపేటలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. నవంబరులో పత్తి పంట ఏరే సమయం కావడంతో అదేనెల మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● వానాకాలం సాగు దిగుబడి అంచనా ఇలా...

జిల్లా వ్యాప్తంగా వానాకాలం పత్తి సీజన్‌కు సంబంధించి 1,61,193 ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేశారు. ఎకరాకు సగటున ఎనిమిది క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని అంచనా వేస్తుండగా, మొత్తంగా 13,33,811.2 క్వింటాళ్ల పత్తి రైతుల చేతికి వస్తుందని భావిస్తున్నారు.

● పెరిగిన సాగు ఖర్చులు...

వ్యవసాయ రంగంలో పంట సాగు విస్తీర్ణంకోసం రైతులు అధిక ఖర్చులు భరించాల్సి వస్తోంది. భూమి దున్నింది మొదలు పత్తిపంట చేతికి వచ్చే దాకా ఎకరాకు సగటున 40వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కనీసం ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా అన్ని ఖర్చులు పోను 20వేల రూపాయల చొప్పున మిగిలుతుందని చెబుతున్నారు. అయితే ఈయేడు అతివృష్టితోపాటు..

- మిగతా 7లో

మండలాల వారీగా పత్తి సాగు, దిగుబడి అంచనా ...

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (క్వింటాళ్లలో)
బెల్లంపల్లి	6,503	52,674.3
కాసిపేట	12,400	1,05,400
తాండూరు	15,121	1,26,905
భీమిని	23,190	1,97,115
కన్నెపల్లి	16,963	1,35,704
నెన్నెల	9,600	76,800
వేమనపల్లి	8,314	67,343.4
కోటపల్లి	19,625	1,62,887.5
చెన్నూరు	12,890	1,08,276
జైపూరు	6,190	51,377
భీమారం	4,250	34,425
మందమర్రి	6,600	54,120
మంచిర్యాల	480	3,840
నస్పూర్	50	400
హాజీపూర్	5,880	48,804
లక్షెట్టిపేట	5,608	44,864
దండేపల్లి	4,000	32,000
జన్నారం	3,720	30,876

ఏజీపీగా దండనాయకుల మనోహర్‌రావు



మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు దండనాయకుల మనోహర్‌రావు ప్రిన్సిపాల్ సబ్‌కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2010 సంవత్సరం నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను అభినందించారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

హాజీపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకరావాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూసదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారి 63 నిర్వహణలో భాగంగా భూసేకరణ కార్యక్రమానికి సంబంధించి అవార్డు జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

నస్పూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందుగా ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకున్నారు. ధర్నా అనంతరం పంచాయతీ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందక కార్మికులకు పండగ పూట ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సీఐటీయు నాయకులు దుంపల రంజిత్‌కుమార్, సంకె రవి, గోమాస ప్రకాష్, చల్లూరి దేవరాజ్, అంబటి లక్ష్మణ్, సాగర్, సుధాకర్, పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు యశోధ, లత, నాయకులు పోసవ్వ, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



ట్రాఫిక్ పోలీసులకు బారికేడ్లను అందజేస్తున్న బర్త్ రూట్స్ ఆసుపత్రి డాక్టర్ శృతి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు సామాజిక సేవలో ముందుండాలని బర్త్ రూట్స్ ఆసుపత్రి డాక్టర్ శృతి గోలి అన్నారు. ట్రాఫిక్ పోలీసుల అభ్యర్థన మేరకు సుమారు లక్ష రూపాయల విలువ గల బారికేడ్‌లను ఆమె ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శృతి గోలి మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గోలి తిరుపతి, ట్రాఫిక్ సీఐ సత్య నారాయణ, సిబ్బంది రవి, వంశీ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ఎఫ్‌డీవో రామ్మోహన్



జన్నారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములు ఆక్ర మించినా, చెట్లు నరికినా చర్యలు తప్పవని జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఎఫ్‌డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలో గలలో తొర్రె బీట్‌లోని పాలగోరి అటవీ ప్రాంతంలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు అటవీ భూములను ఆక్రమించుకొని చెట్లు నరికారన్నారు. దీంతో 26మందిపై కేసులు నమోదు చేసి ఈనెల 18న కోర్టులో హాజరు పరుచగా వారికి 14రోజుల రిమాండ్ విధించిందని మరో 20మంది వరకు ఆక్రమించినవారిలో ఉన్నారని వారిపై కూడ కేసులు తప్పవని అన్నారు. త్వరలో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ వర్కర్లు జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

● ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి సీఎండీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సంస్థలో పని చేస్తున్న 1,258 బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరిస్తూ సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డిసెంబరు 31, అంతకుముందు ఏడాది కాలంలో భూగర్భ గనులు/ ఉపరితల గనుల్లో 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారికి జనరల్ అసిస్టెంట్ కేటగిరీ-1గా క్రమబద్ధీకరించనున్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా భూపాలపల్లిలో 250 మందికి, శ్రీరాంపూర్ ఏరియాలో 241 మందికి, రామగుండంలో ముగ్గురు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో 167 మందికి, రామగుండం-1 ఏరియాలో 156 మందికి, మందమర్రి ఏరియాలో 64 మందికి, కార్పొరేట్‌లో 21 మందికి, కొత్తగూడెం ఏరియాలో 20 మందికి, మణుగూరు ఏరియాలో 19 మందికి, బెల్లంపల్లి ఏరియాలో 11 మందికి, ఇల్లందు ఏరియాలో ఆరుగురికి ప్రయోజనం కలగనుంది.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఆర్థిక లబ్ధి

● సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం మాట్లాడారు. గతంలో ఉన్న 5,12,18,28 శాతం జీఎస్టీ స్లాబ్‌ల్లో ఇప్పుడు కేవలం 5, 18 స్లాబ్‌ల విధానం తీసుకువచ్చి దేశ ప్రజలకు దసరా కానుకను ప్రధాని మోదీ అందించారన్నారు. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలో అనేక రకాల పన్నులను తీసుకువచ్చి దేశ ప్రజలను దోచుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, వారికి ప్రధాని మోదీ తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై మాట్లాడే హక్కు లేదన్నారు. జీవిత, ఆరోగ్య బీమాపై సున్నా శాతం పన్ను, నిత్యావసర వస్తువులను ఐదు శాతం స్లాబ్‌లోకి తేవడంతో ప్రజలందరికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజలందరూ జీఎస్టీ సంస్కరణలను వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఓ టూ వీలర్ షోరూంను సందర్శించి జీఎస్టీ వల్ల తగ్గిన వాహన ధరలను షోరూం సిబ్బందిని అడిగిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు దుర్గం అశోక్, ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, సత్తన్న, కమలాకర్‌రావు, శ్రీదేవి, రమేష్, సంతోష్, నాగేశ్వర్‌రావు, రామన్న, సత్యనారాయణ, శ్రీనివాస్, చిరంజీవి, సత్యనారాయణ, రాజబాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు



బెల్లంపల్లిలో బతుకమ్మలతో కళాశాల విద్యార్థినులు

బెల్లంపల్లి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయినిలు బుధవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, పాల్గొన్నారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతి అని దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభ అన్నారు. తెలంగాణసాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ సంబరాలను బుధవారం దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీలు, అధ్యాపకురాలు బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



దండేపల్లి ప్రభుత్వ కళాశాలలో..

వైష్ణవి డిగ్రీ కళాశాలలో

లక్షెట్టిపేట (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని శ్రీవైష్ణవి మహిళ డిగ్రీకళాశాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి డీజే చప్పుళ్లతో కోలాటాలు ఆడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆకుల కిరణ్‌కుమార్, కళాశాల డైరెక్టర్ చింత అభినయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు



ఎంఈవో మంత్రి రాజును సన్మానిస్తున్న చిన్నయ్య, సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు

దండేపల్లి సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి (ఎంఈవో)గా మంత్రి రాజు బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటి వరకు ఎంఈవోగా పని చేసిన దుర్గం చిన్నయ్య అనారోగ్యంతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో రెబ్బన పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పని చేస్తున్న మంత్రి రాజు ఎంఈవోగా నియమితులై అదనపు భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజును జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, దుర్గం చిన్నయ్య, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సత్కరించారు.



నూతన ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

భీమిని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికా రిగా పెరుగు వెంకటస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. మండలంలో విద్యాభివృద్ధికి, పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎంఈ వోను ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించి, అభినం దించారు. కార్యక్రమంలో గతంలో ఎంఈవోగా పని చేసిన కృష్ణమూర్తి, పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు సైదం వెంకటేష్, అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, సభ్యులు సురేష్, శేఖర్, వినోద్, దుర్గారాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవారికేదీ..కిసాన్ సమ్మాన్?
● కఠిన నిబంధనలతో రైతుల నిరాశ 6



ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే దారేది..

ఇటీవల కురిసిన వర్షాలకు దండేపల్లి మండల కేంద్రంలో గిరిజన ఉప కార్యనిర్వాహణ ఇంజనీర్ కార్యాలయం చెరువును తలపిస్తోంది. ప్రతీరోజు కార్యాలయానికి సంబంధిత శాఖ ఇంజనీర్ అధికారులు, సిబ్బంది వస్తుంటారు. కార్యాల యం ఎదుట వర్షపు నీరు నిల్వ ఉండటంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - దండేపల్లి, ఆంధ్రజ్యోతి

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
● ఆచరణకు నోచుకోని ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం
● పేద ప్రజల సొంతింటి కల నెరవేరేనా? 7

యూరియా కోసం రైతుల ఇబ్బందులు



నీట మునిగిన పంట పొలాలు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం గోదావరి నదిలోకి వరద నీరు భారీగా చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని వదులుతుండడంతో మండలంలోని వేలాల పుష్కరఘాట్ వరకు వరద నీరు వచ్చింది. రైతులకు సంబంధించిన వరి, పత్తి, మిర్చి పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -జైపూర్, ఆంధ్రజ్యోతి

అరిడెపల్లి అడవుల్లో మళ్లీ పులి అలజడి

ఆవుల మందపై పులి దాడి.. లేగదూడ మృతి

కాసిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి అటవీ రేంజ్ ధర్మారావుపేట అటవీ సెక్షన్ పరిధిలోని అరిడెపల్లి అడవుల్లో మళ్లీ పులి అలజడి మొదలైంది. నెల రోజులుగా ఆచూకీ తెలియని పెద్దపులి మంగళవారం సాయంత్రం ఆవుల మందపై దాడి చేయడంతో అటవీ సమీప ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ధర్మారావుపేట అటవీ సెక్షన్ పరిధిలోని 314/1 కంపార్టుమెంట్‌లో మంగళవారం సాయంత్రం పెద్దపులి ఆవుల మందపై దాడి చేసింది. ఈ ఘటనలో ఆవుల మంద చెల్లాచెదురు కావడంతో కాపరులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. పశువుల కాపరులు బుధవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో బెల్లంపల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. పశువుల కాపర్లు తిర్యాణి మండలం ఏదులపాడ్‌కు చెందిన వారు కావడంతో మృతిచెందిన లేగదూడ కూడా ఏదులపాడ్‌కు చెందిన రైతుదే అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. సంఘటన స్థలంలో పులి కదలికలు, పాదముద్రలను గుర్తించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి మళ్లీ సంచరిస్తుండడంతో అరిడెపల్లి, లక్ష్మీపూర్, వెంకటాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు, రైతులు, వ్యవసాయ కూలీలు ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని అటవీ అధికారులు సూచిస్తున్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్లు కుమారస్వామి, యుగేందర్, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ధ్వంసం ఘటనలో నలుగురి రిమాండ్

నెన్నెల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవడం గ్రామంలో ఓ ఇంటిని ధ్వంసం చేసిన కేసులో నలుగురిని నెన్నెల పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తల్లి ప్రవర్తన నచ్చక కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా మంగళి తిరుపతి అనే వ్యక్తి కారణంగానే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడని గంగారం, ఆవడం, చిత్తాపూర్ గ్రామాలకు చెందిన పలువురు ఆగస్టు 7న తిరుపతి ఇంటిపై దాడి చేశారు. ఇళ్లు ధ్వంసం చేయడంతో పాటు వంటగదికి నిప్పు పెట్టారు. తిరుపతి భార్య శోబారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడి ఘటనలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినదుకు గాను 30 మందిపై కేసు పెట్టారు. వారిలో గంగారం గ్రామానికి చెందిన నరిగె మల్లేష్, నరిగె రాజ్‌కుమార్, సొడ సందీప్, చిత్తాపూర్‌కు చెందిన గందం సాయి సుష్మంత్‌లను అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరుపరిచారు. మున్సిఫ్ మెజిస్ట్రేట్ తీర్పు మేరకు వారిని 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బాలికపై లైంగికదాడి..

నిందితుడికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్ రూరల్/ కౌటాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికపై ప్రేమ పేరుతో లైంగికదాడికి పాల్పడి గర్భిణిని చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.70 వేల జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పు చెప్పినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఓ మండలానికి చెందిన బాలిక(17) ఎనిమిదో తరగతి వరకు చదువుకుంది చదువు మానేసి ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటోంది. ఈ క్రమంలో బడిగే తిరుపతి(26) అనే వ్యక్తి బాలికను ప్రేమిస్తున్నానని, లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె గర్భం దాల్చింది. తిరుపతికి అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాలిక గర్భం దాల్చడంతో 20 మే 2020న ఆమె మెడలో తాళి కట్టాడు. బాలిక తల్లిదండ్రులు ఆమెమెడలో తాళిని గుర్తించి ప్రశ్నించగా ప్రేమ పేరుతో వేధింపులు, గర్భిణి అయిన విషయం తెలిపింది. దీంతో బాలిక తండ్రి కౌటాల పోలీసుస్టేషన్‌లో 23 మే 2020న ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ బీఎల్ఎన్ స్వామి, అదనపు ఎస్పీ వైవీఎస్ సుధీంద్ర, ఏఎస్పీ బాలస్వామి, డీఎస్పీ కరుణాకర్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్మోహన్‌రావు సీడీఓ లైనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రాంసింగ్ సాక్షులను హాజరు పర్చగా జడ్జి సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడు తిరుపతికి జీవితకాలం జైలు శిక్ష, రూ.70 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ వహిదుద్దీన్, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు సీడీపీవో బాలాజీ, భరోసా సెంటర్ అడ్వైజర్ శైలజ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కొత్త వారికేదీ.. కిసాన్ సమ్మాన్?



రెబ్బెన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే చిన్న, సన్నకారు రైతులకు పంట పెట్టుబడికి ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తోంది. ఎకరాకు రైతులకు ఏడాదికి రూ.6వేల చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సాయం అందిస్తోంది. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆ సమయంలో నమోదైన రైతులకే పథకం వర్తిస్తోంది. ఆ తర్వాత పట్టా పాసుపుస్తకాలు పొందిన వారికి లబ్ధి చేకూరడం లేదు.

తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా భూమిని పొందిన వారు, ఇతరుల నుంచి భూమికొనుగోలు చేసిన కొత్త పట్టాలు పొందిన వారు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఏటా వందల సంఖ్యలో కొత్త రైతులు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం పథకంలో చేర్చడం లేదు. 2019లో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ ప్రారంభించగా, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదార్లు, విదేశాల్లో నివాసం ఉండే వారిని ఈ పథకం నుంచి మినహాయించింది.

ఐదెకరాల లోపు..

ప్రారంభంలో భూ పరిమితిని విధించి ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే ఈ పథకం ద్వారా రూ.6వేల సాయాన్ని మూడు విడతల్లో అందించారు. ఏడాది గడిచాక భూ పరిమితి తొలగించి ఎన్ని ఎకరాలున్నా ఒక్కో రైతుకు రూ.6వేల చొప్పున పంపిణీ చేసింది. పాత రైతులకే తప్ప కొత్త వారికి ఈ పథకంలో అవకాశం కల్పించడం లేదు. ఫలితంగా వేలాది మంది కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి దూరమవుతున్నారు.

కొత్త వారికి అవకాశం లేక పోవడంతో క్రమంగా అర్హుల సంఖ్య తగ్గిపోతోంది. వ్యవసాయ శాఖ అధికారుల క్షేత్ర పరిశీనతో మరణించిన రైతుల పేర్లు తొలగింపు, భూముల అమ్మకాలు, కుటుంబ సభ్యుల పేరిట భూములను విరాసత్ చేయటంతో రైతుల సంఖ్య తగ్గింది. ఒకే కుటుంబంలో ఇద్దరికి ఈ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరడం, ఉద్యోగులు, ఐటీ చెల్లింపు దారులు ఇలా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో వివరాలు బహిర్గతం కావడంతో వారికి పథకం నిలిపివేసింది. కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో జిల్లాలో 1,42,155 మంది రైతులున్నారు. పథకంలో ప్రారంభంలో సుమారు 68వేల మంది పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం అందింది.

కానీ కొన్ని నెలల క్రితం కేంద్రం విడుదల చేసి 20వ విడత 33,369 మందికి మాత్రమే కిసాన్ సమ్మాన్ ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరినట్లు చెబుతున్నారు. అర్హులు కూడా పెట్టుబడి కోసం అప్పులపై ఆధారపడుతున్నారు. రాష్ట్ర ప్రబుత్వం కూడా రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం అందిస్తోంది. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రె స్ సర్కారు కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతుల వివరాల నమోదుకు నిర్దిష్టమైన తేదీని నిర్ణయించాయి. అప్పటి వరకు పట్టాలు పొందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి పేర్లు నమోదు చేస్తున్నారు. కానీ కేంద్రప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త రైతును కూడా కిసాన్ సమ్మాన్‌లో చేర్చలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్న రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీలో దసరా లక్కీడ్రా

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా ఈ నెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే వారికి ప్రత్యేక లక్కీ డ్రా స్కీం అమలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడారు. ఈ స్కీంలో సూపర్‌లగ్జరీ, లహరి బస్సులలో ప్రయాణించే వారికి మాత్రమే ఉంటుందన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ బస్టాండ్‌లలో లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణం చేసిన తరువాత టికెట్ వెనక భాగంలో పేరు, చిరునామా, మొబైల్‌నంబర్ రాసి బాక్సులలో వేయాలని సూచించారు. అక్టోబరు 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఆర్ఎం కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించనున్నామని చెప్పారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేయ నున్నామని డిపో మేనేజర్ తెలిపారు.

సర్‌సిల్క్ కాలనీలో చోరీ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ కాలనీలో నివాసం ఉంటున్న పాల్వాయి శ్రావణ్‌రావు ఇంట్లో బుధవారం వేకువ జామున చోరీ జరిగింది. శ్రావణ్‌రావు ఇంట్లో లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు, సమాచారం మేరకు పోలీసులు చోరీ విషయంపై ఆరా తీస్తున్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యా, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాఠశాలలో మౌలిక వసతులు, తరగతి గదుల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాల్లో మౌలిక వసతులు, తాగునీరు మూత్రశాలలు, బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలలు, విద్యుత్ సరఫరా, గదుల నిర్మాణాలు, అదనపు గదుల నిర్మాణాలు ఇతర పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన మత్రి జుగా, ప్రధాన మంత్రి జన్‌మన్ పథకాల కింద చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో విద్యారంగంలో చేపట్టిన పనులు త్వరగాపూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిలిచి పోయిన పనులపై సంబంధిత కాంట్రాక్టర్‌లతో సంప్రదించాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో విద్యాశాఖాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి



రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ కాలనీకి గత 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక పోవడంతో విసుగు చెందిన కాలనీవాసులు బుధవారం సందీప్ నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 20 రోజులుగా నీరు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల యూరియా దందా

బెజ్జూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు యూరియా దందా చేస్తూ రైతులకు అందకుండా బ్లాక్‌లో అమ్ముకుంటూ దోచుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.270కి దొరికే యూరియా రూ.1000లకు అమ్ముతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే గన్‌మెన్‌లు తుపాకులు చూపెట్టి లారీల కొద్ది యూరియా మాయం చేస్తున్నారన్నారు. ఇటీవల కౌటాల మండలం బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అనుచరులు లారీ యూరియాను దారి మళ్లించారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయాధికారి కూడా సస్పెండ్ అయ్యారని తెలిపారు. గతంలో కేసీఆర్ పాలనలో యూరియా కోసం ఇంత దారుణంగా రైతులు బాధపడలేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడు కష్టం రానివ్వలేదని ప్రవీణ్‌కుమార్ గుర్తు చేశారు. ఆయన వెంట నాయకులు హర్షద్ హుస్సేన్, సారయ్య, తిరుపతి, ఖాజా, బాబురావు, మోహన్, దేవయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

నాటుసారా స్థావరాలపై దాడులు

దహెగాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపల్లి, దేవులగూడ, కల్వాడ గ్రామాల్లో బుధవారం నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. దాడుల్లో 12 లీటర్ల నాటు సారాతో పాటు పది కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఈ మేరకు మర్రిపల్లికి చెందిన బాదవత్ రాజేందర్, దరావత్ వందనపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడిలో ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్సైలు పి లోభానంద్, ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

జైపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు అన్నారు. ఎస్టీపీపీలో స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్లాంట్ పరిసరాల్లో స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాంట్ సర్వీసు భవనం పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నర్సింహారావు, మదన్ మోహన్, కిరణ్ బాబు, వేణుగోపాల్, శివప్రసాద్, సంతోష్ కుమార్, వీరబ్ర హ్మం, వాసుదేవమూర్తి, అఖిల్‌కపూర్‌లు పాల్గొన్నారు.

పెన్షన్లు ముందస్తుగా చెల్లించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు సెలవుల దృష్ట్యా ముందస్తుగా పెన్షన్లు చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు బ్యాంకులకు సెలవులు వస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగో శనివారం, ఆదివారం, దుర్గా పూజ, దసరా వంటి పండుగలు రావడంతో పెన్షన్లు పడే అవకాశం లేదని తెలిపారు. దీనివల్ల తెలంగాణలోని సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఇబ్బందులు పడుతారని తెలిపారు. పండుగలకు ఖర్చులు ఉంటాయని, సీఎంపీఎఫ్ అధికారులు స్పందించి ముందస్తుగా పెన్షన్లు అందించే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమస్యల పరిష్కారంతో పాటు కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా పని చేస్తున్నామని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. వర్క్‌షాపులో బుధవారం కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా జావ్యంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది తమ యూనియన్ అని తెలిపారు. దీంతో ఇటీవల ముఖ్యమంత్రి లాభాల వాటాను ప్రకటించారని చెప్పారు. త్వరలోనే ఖాతాలో జమ చేయనున్నారని తెలి పారు. ఉద్యోగులు తమ యూనియన్‌పై ఉంచిన నమ్మ కాన్ని వమ్ము చేయబోమని తెలిపారు. పెండింగ్ సమ స్యల సాధనకు సంబంధించి త్వరలోనే యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. వాటిని పరిష్కారం చేయ కపోతే పోరాటాలతోనే సాధిస్తామన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కలిసి ఉద్యోగులను మోసం చేసిందని చెప్పా రు. పెట్టుబడుల పేరుతో లాభాలవాటా నుంచి 4వేల కోట్లను పక్కకు పెట్టిందన్నారు. కాంట్రా క్టు కార్మికులకు 5500 గాకుండా 6వేలు చెల్లిం చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శర్మ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పిల్లల కోసమే సీబీఎస్ఈ పాఠశాల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటి సెక్రటరీ వెంకటచారి

జైపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్‌లో ఉన్న ఉద్యోగుల పిల్లల కోసం సీబీఎస్ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటి సెక్రటరీ వెంకటచారి అన్నారు. ఎస్టీపీపీలో బుధవారం పర్యటించి పాఠశాల నిర్మించే ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం 202 6-27 నుంచి తాత్కాలిక భవనంలో పాఠశాలను ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మరికొన్ని రోజుల్లో విద్యాశాఖ అధికారులు వచ్చి తాత్కాలిక భవనాన్ని తనిఖీ చేస్తారని, తాత్కాలిక భవనంకు చేపట్టాల్సిన మరమ్మతు లను చేయించాలని అధికారులకు సూచించారు. చుట్టూ ప్రహారీ నిర్మించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. వచ్చే నెలలో మళ్లీ వచ్చి తనిఖీ చేస్తానని, ఆలోగా అన్ని రకాల అనుమతులు తీసుకుని సిద్ధంగా ఉండాలని, తెలిపారు. అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు నర్సింహారావు, మురళీధర్, మదన్‌మోహన్, కిరణ్‌బాబు, పాత్రుడు, ప్రసాద్, ఠాకూర్ మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే పదోన్నతులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో తమ యూనియన్ ఒప్పందం మేరకు బదిలీ వర్కర్లందరికీ జనరల్ అసిస్టెంట్ పదోన్నతుల సర్క్యులర్ యాజమాన్యం జారీ చేసిందని, త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశం ఉందని గుర్తింపుసంఘం మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సీఎండీ సమక్షంలో డైరెక్టర్లతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించామని తెలి పా రు. అండర్ గ్రౌండ్‌లో 190, ఉపరితంలో 240 మస్టర్లు నిండిన వారికి ఈనెలాఖరులో జనరల్ అసిస్టెంట్ పదోన్నతులు లభిస్తాయని తెలిపారు. కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, రమణ, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రావు, శర్మ పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్లను పరిశీలించిన జీఎం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించే దసరా ఏర్పాట్లను మంద మర్రి జీఎం రాధాకృష్ణ, గుర్తింపు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. రామ్‌లీలా సందర్భంగా దహనం చేయనున్న సప్త వ్యసనాల రాక్షస బొమ్మ తయారీని పరిశీలించారు. బతుకమ్మల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్నతాత్కాలిక చెరువును ఆయన పరిశీలించారు. జీఎం మా ట్లాడుతూ దసరా, బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం విజయ్‌ప్రసాద్, పీఎం శ్యాంసుదర్, గుర్తిం పు సంఘం నాయకులు సత్యనారాయణ, సుదర్శన్, కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పండుగ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ అన్నారు. క్రిష్ణకాలనీలోని శాంతి స్టేడియంను ఆయన బుధవారం పరిశీలించారు. సింగరేణి ఫ్యామిలీ డే, సద్దుల బతుకమ్మ కోసం శాంతి స్టేడియంను ఎంపిక చేశామన్నారు. స్టేడియం ఎదుట గల శివుడి విగ్రహం దగ్గర నీటి కొలను ఏర్పాటు చేశామన్నారు. వెల్తురు కోసం తగినన్ని లైట్లు బిగించాలన్నారు. ఉత్తమ బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సివిల్ ఇంజనీర్ గుండేరావు, ఏరియా వర్క్‌షాప్ ఇంజనీరు రాకేష్, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సమాయత్తం

(5వ పేజీ తరువాయి)

యూరియా సకాలంలో అందక దిగుబడిపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరపిలేకుండా భారీవర్షాలు కురియడంతో మొలక దశలోనే పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. పంటకు సకాలంలో యూరియా సకాలంలో చల్లకపోవడం తో చెట్టు పెరుగుదలపై ప్రభావం చూపిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం ఎకరాకు గరిష్ఠంగా నాలుగు క్వింటాళ్ల కూడా దిగుబడి వచ్చే పరిస్థితిలేదని, సాగు ఖర్చులుకూడా గిట్టుబాటు కావని చెబుతున్నారు.

● **మద్దతు ధరపై అసంతృప్తి...**

ఆరుగాలం కాయ కష్టం చేసి, పండించిన పంటలకు కనీస మద్దతు ధర రావడం లేదని కొంతకాలంగా రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పత్తిపంట మద్దతు ధరలు కూడా కంటి తుడుపు చర్యగానే ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈయేడు పత్తికి క్వింటాలుకు 8,110 రూపాయల మద్దతు ధర ప్రకటించారు. గత ఏడాది క్వింటాలు పత్తి మద్దతు ధర 7,521 రూపాయలు ఉండగా, ఈ సంవత్సరం అంతకంటే 589 రూపాయలు ఎక్కువగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సీసీఐలో విక్రయాలు జరిపితే కష్టమే మిగులుతుందని, ప్రైవేటు ఆశ్రయించడమే మేలన్న ఆలోచనలో రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు మార్కెట్లో ధర ఎక్కువ లభించే అవకాశాలు ఉండటంతో అటువైపే రైతులు మొగ్గు చూపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాగు ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గే అవకాశాలు ఉండటంతో గిట్టుబాటు ధర కోసం రైతులు వేచి ఉండే అవకాశాలు ఉన్నాయి.

మద్దతు ధర మరింతగా పెంచాల్సింది..



లగిసెట్టి రాజమౌళి, రైతు గుడిపేట

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మరింతగా పెంచితే మేలు జరిగి ఉండేది. పత్తిపై గత సంవత్సరం కంటే కేవలం రూ. 589 ఎక్కువగా పెంచారు. అధిక వర్షాలు, యూరియా కొరత కారణంగా ఆశించిన మేర పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు సన్నగిల్లాయి. ఐదెకరాల్లో పత్తిసాగు చేస్తే సాధారణంగా 60 క్వింటాళ్ల పంట చేతికి రావాలి. కానీ ఈ యేడు పరిస్థితులు అనుకూలించక సగటున ఎకరాకు నాలుగు క్వింటాళ్ల మేర మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాకు రూ. 8,110తో విక్రయిస్తే సాగు ఖర్చులు కూడా చేతికి రావు. పత్తికి కనీసం రూ. 10వేలు మద్దతు ధర చెల్లిస్తే పెట్టుబడి ఖర్చులు గిట్టుబాటవుతాయి.

జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని, పంట సాగుకు అనుగుణంగా యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో వ్యవ సాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. సకాలంలో రైతులకు కార్యచరణ ప్రకారం అందించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయాలన్నారు. కాలానికి అనుగుణంగా రైతులు సాగు చేయాల్సిన పంటల వివరాలు, సాగు మెళకువల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,560 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని, 1,600 మెట్రిక్ టన్నులు అందించడం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, సహకార శాఖ అధికారి బిక్కు, వ్యవసాయాధికా రులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాండూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకాపూర్, రేచిని గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ బుధవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ద్వారకాపూర్‌లో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి రోడ్లు, మురికి కాలువలను ప్రతీ రోజు శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు సూచించారు. పీఎం ఆవాస్ యోజన సర్వేను పరిశీలించి వేగవంతం చేయాలన్నారు. రేచిని గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఏఎన్ఎం శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

ఆచరణకు నోచుకోని ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం

పేద ప్రజల సొంతింటి కల నెరవేరేనా?

భీమారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. దీంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం సైతం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఒకే ఫార్మట్‌లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుబంధు, పింఛన్, ఎల్పీజీ గ్యాస్, గృహజ్యోతి వంటివి జాబితాలో



పొందుపర్చి ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని 11 గ్రామపంచాయతీల ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్లను సైతం ఎల్ వన్, ఎల్ టూ, ఎల్ త్రీగా విభజించి ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో ప్రజలు సొంతింటి కల నెరవేరుతుందని కలలు కంటున్నారు.

అర్హులకు అందని ఇళ్లు

మండలంలోని గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదని పేర్కొంటున్నారు. ఇందిరమ్మ కమిటీలు వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు వచ్చాయని పేర్కొంటున్నారు. రేకుల షెడ్లలో, అట్ట గుడిసెల్లో, పాకల్లో ఉంటున్న చాలా మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదు. నాయకుల కనుసైగల్లో ఇందిరమ్మ కమిటీ కనుసైగల్లోనే మొదటి విడత జాబితా వచ్చిందని అసలు ఇళ్లే లేని వారికి, గుడిసెలో ఉన్న వారికి మొదటి జాబితాలో ఇల్లు రాలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో 3,743 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా ఎల్ వన్ ఫేజ్‌లో 400 ఇళ్లు మంజూరు అయ్యాయి. భీమారంలో 176, ఆరేపల్లిలో 32, బూరుగు పల్లిలో 27, ధర్మారంలో 15, ఎల్కేశ్వరంలో 17, కొత్తపల్లిలో 25, ఖాజీపల్లిలో 27, నర్సింగాపూర్‌లో 21, పోలంపల్లిలో 26, మద్దికల్‌లో 34 ఇళ్లు ఉన్నాయి. ఇంటి నిర్మాణాలు ప్రస్తుతం కొన్ని బేస్‌మెంట్ లెవెల్‌లోనే ఉన్నాయి. సగానికి పైగా ఇంటి నిర్మాణాలు వాతావరణ పరిస్థితుల వల్ల, వ్యక్తిగత కారణాలతో, ఇతర కారణాలతో ఇళ్లను ప్రారంభించలేదు.

ప్రభుత్వం లెవెల్ స్థాయిని బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేస్తుంది. బేస్‌మెంట్ లెవెల్ పూర్తయితే లక్ష రూపాయలు, రూఫ్‌లెవెల్ వరకు వాల్స్ లేపినట్లయితే లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్‌కు రెండు లక్షలు, కరెంటు ఇతర పనులకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందిస్తుంది. లబ్ధిదారులకు ముందుగా చేతిలో డబ్బులు లేకపోవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు నిర్మించుకోవడం లేదు. కొందరి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని ధర్మారం విలేజ్‌ను ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ గ్రామంగా ఎంపిక చేసింది. ఈ గ్రామంలో 48 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్ పూర్తికాగా, 16 ఇళ్ల నిర్మాణం వివిధ కారణాలతో ఆగిపోయాయి. స్లాబ్ లెవెల్‌లో రెండు ఇల్లు పూర్తయ్యాయి.



భీమారంలో బేస్‌మెంట్ లెవెల్‌లో నిలిచిపోయిన ఇందిరమ్మ నమూనా ఇల్లు

బేస్‌మెంట్‌కే పరిమితమైన నమూనా ఇందిరమ్మ ఇల్లు

మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పొడవు, వెడల్పు ఎలా ఉంటుందో లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో తెలిసే అవకాశం ఉంటుంది. కానీ ఇంటి నిర్మాణానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో బేస్‌మెంట్‌కే పరిమితమైంది.

ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి



తగరం మల్లయ్య, భీమారం

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇంది రమ్మ ఇళ్లు అందించడం శుభ పరిణామం. కానీ లబ్ధిదారులకు ప్రభుత్వం ముందుగానే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తే ఇల్లు నిర్మించుకోవడానికి సు లువుగా ఉంటుంది. త్వరగా ఇళ్లను నిర్మిం చుకుంటారు. ప్రస్తుతం రైతులు, మధ్య తరగతి ప్రజల చేతుల్లో డబ్బులు లేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం ముం దుగానే డబ్బులు చెల్లిస్తే త్వరగా ఇళ్లు నిర్మించుకుంటారు.

గుత్తేదారులకు అప్పగిస్తే మేలు



తైదల నరేందర్, భీమారం

ఇందిరమ్మ ఇళ్లను రోడ్లు భవనాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారులకు అప్పగిస్తే నిర్మాణాలు త్వరగా పూర్తవుతాయి. దీంతో పాటు లబ్ధిదారులకు ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు. వర్షాకాలంలో నిర్మాణాలు చేపట్టడం వల్ల పునాది తగ్గుతూ నీరు ఊరే పరిస్థితి ఉంది.

అధికారుల రీసర్వే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 5లక్షలను ప్రభుత్వం అందిస్తుంది. దానిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హౌజింగ్ కార్పొరేషన్ ద్వారా రూ. 4.80 లక్షలు మంజూరు చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ. 72 వేలను మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గృహనిర్మాణాలు చేపడితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ. 72 వేలు మంజూరు చేస్తుంది. దీంతో అధికారులు ప్రారంభంలో లబ్ధిదారుల ఐరిస్‌ను గుర్తించినప్పుడు ఉన్న గుర్తింపు కాకుండా ప్రస్తుతం మళ్లీ ఐరిస్ గుర్తింపు కోసం సర్వే చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నారు.

డ్రైవర్ కుమార్తెకు ఓయూ మెడికల్ కళాశాలలో సీటు

నస్పూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ రాంనగర్‌కు చెందిన పారుపల్లి ఐశ్వర్యరాజ్ నీట్-2025 ఫలితాల్లో 1,048 ర్యాంక్ సాధించి ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తండ్రి పారుపల్లి రాజు ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కూతురును పదోతరగతి వరకు స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల చదివించాడు. అనంతరం ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీ వశిష్ట జూనియర్ కళాశాలలో చదివింది. నీట్ రాసి మంచి ర్యాంక్‌ను సాధించింది. బుధవారం వశిష్ట కళాశాల ఏజీఎం మీన వేణుమాదవ్, డీజీఎం కిరణ్ ప్రసాద్ ప్రశంసా పత్రం అందించి అభినందించారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో తాండూర్ మండలం అచ్చలాపూర్ కొమ్ముగూడెంకు చెందిన రిటైర్డు సింగరేణి కార్మికుడు పెరుగు లింగయ్య, పాపమ్మ దంపతుల కుమారుడు పెరుగు రవిప్రసాద్ మెడికల్ సీటు ఏ కేటగిరీలో సాధించాడు. రవి ప్రసాద్ ఇంటర్మీడియట్ హైద్రాబాద్‌లోని ఎస్ఆర్ కళాశాల మల్లంపేట బ్రాంచ్‌లో పూర్తి చేసి మొదటి ప్రయత్నంలోనే మెడికల్ సాటు సాధించాడు. ఈ సందర్భంగా రవిప్రసాద్‌ను కళాశాల యాజమాన్యం జీఎం భగవాన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వాసు, ఏజీఎం స్వరూప్, అడ్మిషన్ ఇన్‌చార్జిలు రాజ్‌కుమార్, శ్రీకృష్ణదేవరాయలు, సురేష్ అభినందించారు.

వర్షానికి కొట్టుకుపోయిన తూము

మందమర్రిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మూడి చెరువు తూము కొట్టుకుపోయింది.

గత కొంత కాలంగా శిథిలావస్థలో ఉన్న తూము వరుసుగా కురుస్తున్న వర్షాలకు బలహీన పడి కొట్టుకు పోయిందని గ్రామస్థులు తెలిపారు. ఇరిగేషన్ డీఈ శారద, ఏఈ నాగశిల్ప, ఆర్ఐ గణపతిలు బుధవారం తూమును పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి తూము మరమ్మత్తలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామసభ అడ్డగింత

మందమర్రిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీలో గురువారం రెవెన్యూ అధికారులు ఆర్కే ఓసీపీ ప్రాజెక్టు విస్తరణ కోసం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఓసీపీ విస్తరణ చేయడం వల్ల గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటుతాయని, శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని, బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు దెబ్బతింటాయని అధికారులకు వివరించారు. ఓసీ విస్తరణ పనులను విరమించుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఓసీపీ విస్తరణతో గ్రామంలోని యువకులకు ఉద్యోగాలు లభించే అవ కాశం ఉంటుందన్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, సింగరేణి ఫారెస్టు అధికారులు, గ్రామస్తులు ఎండీ ఫిరోజ్, బచ్చలి ప్రవీణ్, ఆసంపల్లి శివ కుమార్, బచ్చలి రాములు, రామగిరి కుమారస్వామి, రాజారాం, శంకర్, కుమార్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీలకు ఎంపిక



మొగిలి



అర్జున్

బెల్లంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అక్టోబరులో జరుగనున్న కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు బెల్లంపల్లి సై జిమ్ బాడీ బిల్డర్లు ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం జరిగిన సింగరేణి కంపెనీ బాడీ బిల్డింగ్ పోటీల్లో బెల్లంపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగులు జనగామ మొగిలి(75కిలోల విభాగంలో), అర్జున్ (70 కిలోల విభాగంలో) ప్రతిభ చాటి ప్రథమ స్థానం పొందారు. దీంతో కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. అలాగే 55కిలోల విభాగంలో క్రిష్ణస్వామి ప్రతిభ చాటి ద్వితీయ సాధించారు. వారిని జిమ్ కోచ్ సదానందం, నిర్వాహకులు బాలక్రిష్ణ, చంద్రశేఖర్ అభినందించారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

నెన్నెల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని నెన్నెల ఎస్సై ప్రసాద్ అన్నారు. గంగారంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిఘా నేత్రాలతో నేరాలు అదుపులోకి వస్తున్నాయన్నారు. ఇళ్లు, దుకాణాల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వాటర్ ప్లాంటు ప్రారంభించారు. స్థానిక నాయకులు జాడి రాజ్‌కుమార్, దుర్గం రవీందర్, దేవేందర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులకు ప్రయోజనం

దండేపల్లి సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామగిరి రమేష్ అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు హెల్త్‌కేర్ విభాగంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. ఈ సందర్భగా ఒకేషనల్ ట్రైనర్ వసంత పర్యవేక్షణలో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 10 రోజులు ఇంటర్న్‌షిప్ శిక్షణ పూర్తి చేశారు.

విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు 2025-26 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. యుఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కోరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సులు చదవాలనుకునే షెడ్యూల్డు కులాల అభ్యర్థులు నవంబరు 19లోగా ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.ఈపాస్.సీజీజీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడిగా నయీంపాషా

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నయీంపాషాను బుధవారం ఎన్నుకున్నారు. తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ నియామ కంలో భాగంగా రాష్ట్ర ఇన్‌చార్జి ప్రియాంక ఆదేశాల మేరకు తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కన్వీనర్ సుధాకర్ నయీంపాషాకు నియామకపత్రం అందజేశారు.



నియామకపత్రం అందుకుంటున్న నయీంపాషా

అవీ.. ఇవీ..

మంచిర్యాల క్రైం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాత మంచిర్యాలలోని రామలింగేశ్వర ఆలయంలో ఈనెల 27న చండీయాగం నిర్వహిస్తున్నామని అర్చకులు అష్టకాల రాజేష్ తెలిపారు.

చెన్నూరు: కిష్టంపేట గ్రామంలోని దొండ సాగును ఉద్యానవన శాఖ అధికారిణి కళ్యాణి, విస్తరణ అధికారి రమేష్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

జైపూర్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైద్రాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన మన బతుకమ్మ అనే అంశంపై ఇందారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గోపగాని రవీందర్ కవితాగానం చేశారు.

బెల్లంపల్లి: పట్టణంలోని 33వ వార్డులో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ దుర్గాదేవికి పూజలు నిర్వహించారు.

హాజీపూర్: మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 5.5లక్షల క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 40గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు.

హక్కుల సాధనకు సత్యశోధక్ సమాజ్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మెజార్టీవర్గాల సమాన హక్కుల సాధన కోసమే మహాత్మాఫూలే సత్యశోధక్ సమాజ్ సంస్థను స్థాపించాడని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలలో సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, నాయకులు లక్ష్మణ్, రాజన్న, జయరావు, కోటిలింగం, అంజయ్య, కైలాసం, యాదగిరి, రమేష్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పోచమ్మ కట్ట చెరువు వద్ద బతుకమ్మ పనులను కమిషనర్ సంపత్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్ సకాలంలో పనులను పూర్తిచేయాలని విన్నవించారు. పోచమ్మ ఆలయం, నాగదేవత ఎదుటఉన్న బతుకమ్మ మెట్లకు రంగులు వేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

రోడ్డుకు మరమ్మతులు

కోటపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏదులబంధం గ్రామం నుంచి లింగన్నపేట

సంక్షిప్త సమాచారం

గ్రామం వరకు జనగామ మాజీ సర్పంచు గట్టు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డంతా గుంతలమయం కాగా ఈ రూట్‌లో బస్సులను నిలిపివేశారు. పండగ పూట ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి మరమ్మతులు చేయించాలని సూచించడంతో మాజీ సర్పంచు లక్ష్మణ్‌గౌడ్ ముందుకు వచ్చి ట్రాక్టర్లు, కూలీల సహాయంతో గుంతల్లో మట్టి పోసి పూడ్చివేశారు. కాంగ్రెస్ యువ నాయకులు దాగామ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

బెల్లంపల్లి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ రచించిన సోయి బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకావిష్కరణను బుధవారం చేశారు. సమన్వయకర్తలు శ్రీనివాస్, మోహన్, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 24 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెలకు చెందిన వేమనూరు శ్రీధర్(43) అనే వ్యక్తి బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సొంతపని నిమిత్తం ఉదయం లక్షెట్టిపేటకు తన బైక్‌పై వచ్చి బస్టాండ్ సమీపంలో గుండెపోటుతో కుప్పకూలి పోయాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు.

'విచారణ చేపట్టకుండానే విధుల నుంచి తొలగించారు'

దండేపల్లి సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న తనపై అధికారులు ఎలాంటి విచారణ చేయకుండానే విధుల నుంచి తొలగించారని లావుడ్య ఉషా ఆవేదన వ్యక్తం చేశారు. దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేజీబీవీలో నిధుల దుర్వినియోగానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయంపై డీఈవో యాదయ్యను వివరణ కోరగా గతంలో కేజీబీవీలో జరిగిన దానిపై విచారణ చేపట్టి, ఉషాకు షోకాజ్ నోటిస్ ఇచ్చామన్నారు. మళ్లీ విచారణ అనేది ఉండదన్నారు.

భగవద్గీత ప్రచారం

చెన్నూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దసరా సెలవుల సందర్భంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మంచిర్యాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఇబ్బందులు





కోటపల్లిలో వర్షంలో తడుస్తూ క్యూలైన్‌లో నిల్చున్న రైతులు, అంగ్రాజ్‌పల్లి రైతువేదికలో..

కోటపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మల్లంపేట గ్రామంలో బుధవారం యూరియా పంపిణీ జరగగా రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచే పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరగా వర్షం కురిసింది. కొందరు రైతులు వర్షంలో తడుస్తూ, మరికొందరు రైతులు గొడుగులు పట్టుకుని క్యూలో నిల్చున్నారు. మండల కేంద్రానికి 888 యూరియా బస్తాలు, మల్లంపేట గ్రామానికి 444 బస్తాలు రాగా వందల సంఖ్యలో రైతులు పంపిణీ కేంద్రానికి చేరుకున్నారు. కాగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా పంపిణీ చేయగా వందలాది మందికి యూరియా దొరకకుండానే వెనుదిరిగారు.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచన్‌పల్లి గ్రామరైతులకు 266 యూరియా బస్తాలు రాగా బుధవారం అంగ్రాజ్‌పల్లి రైతు వేదికలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేఖ ఆధ్వర్యంలో యూరియా బస్తాలను రైతులకు అందజేశారు. యూరియా కోసం రైతులు క్యూలో నిల్చున్నారు. క్యూలోఉన్న రైతులకు యూరియా బస్తాలు అందించారు.

శ్రీరాంపూర్

టీజీబీలో చోరీకి యత్నం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నించాడు. కానీ ఏమీ దొంగిలించకుండానే వెనుదిరిగాడు. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి బ్యాంకు గోడ దూకి లోపలికి ప్రవేశించిన నిందితుడు తాళం పగులగొట్టాడు. అనంతరం లోపలికి వెళ్లి ఇనుప గ్రిల్స్‌ను కట్ చేశాడు. ఐరన్ సేఫ్ ఉన్న గదిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరకు వెనుదిరిగాడు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. అనంతరం సంఘటనా స్థలాన్ని సీఐ వేణుచందర్ పరిశీలించారు. బ్యాంకు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి

జన్నారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ అభియన్ కార్యాక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రావ్య, డాక్టర్ ప్రీతిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఉమాశ్రీ మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్ (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ క్యాంపు నిర్వహించామని క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ శ్రావ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుందారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



- స్థానిక ఎన్నికల షెడ్యూల్‌పై కొనసాగుతున్న కసరత్తు
- త్వరలో కొలిక్కి వచ్చే అవకాశం
- కలిసొస్తాయో.. లేదోనని ఆశావహుల్లో ఆందోళన
- పోటీ చేసేందుకు సిద్ధం చేసుకుంటున్న నాయకులు

రిజర్వేషన్లపై 'ఉత్కంఠ'



ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్లు కొలిక్కి వస్తుండడంతో ఆశావాహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఆయా స్థానాల నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్న నాయకులు తమకు ఈ రిజర్వేషన్లు అనుకులిస్తాయా లేదోనని ఆందోళనలో ఉన్నారు. ఏ స్థానం ఎవరికి వస్తుందోనని చర్చ సాగుతోంది. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, సంబంధిత అధికార యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై విస్తృతంగా కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్లపై అధికార యంత్రాంగం గతంలో కేటాయించిన రిజర్వేషన్ల ప్రతులను పరిశీలించి రిజర్వేషన్లపై తుది నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నది. ఈ నేపథ్యంలో ఏ గ్రామపంచాయతీ ఎవరికి రిజర్వ్ అవుతుంది ఏ ఎంపీటీసీ స్థానం ఎవరికి దక్కుతుంది అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రత్యేక జీవో తీసుకువచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రెండు, మూడు రోజుల్లో రిజర్వేషన్లను ప్రకటించే అవకాశం ఉంది.

● 60కి పైగా ఏజెన్సీ పంచాయతీలు..

జిల్లాలో 60కి పైగా ఏజెన్సీ గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలలో సర్పంచ్ స్థానాలు ఎస్టీలకే రిజర్వుడ్ కానున్నాయి. ఏజెన్సీలో ఎంపీటీసీ, వార్డులకు 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. కుల గణన సర్వే ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ సారి బీసీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల సంఖ్య పెరగనుంది. కాగా జనరల్ స్థానాల్లోనూ బీసీలు పోటీ చేసే అవకాశం కల్పిస్తుంది.

● జిల్లాలో 3,53,895 మంది ఓటర్లు..

జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీల పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. 15 జడ్పీటీసీ స్థానాలు, 127 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా లోని 15 మండలాల్లో మొత్తం 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు, 20 మంది ఇతరులు ఉన్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రకటించింది. తాజాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిజర్వేషన్ల ఖరారుపై అధికారులు కసరత్తును వేగవంతం చేశారు.

● ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్..

రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారుకు అవకాశం ఉన్నందున అంతాట ఉత్కంఠ కనిపిస్తోంది. ఈసారి అనుకూలమైన రిజర్వేషన్ వస్తుందో రాదోనన్న ఆం దోళన ఆశావాహుల్లో మొదలైంది. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలంగా రాకుంటే ఇన్నాళ్లు పడిన శ్రమంతా వృధా అయ్యే అవకాశం ఉందంటూ నాయకులు వాపోతు న్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే సర్పంచ్ లేదంటే ఎంపీటీసీ అనే ఉద్దేశ్యంతో పలువురు నేతలు కనిపిస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఐదు నుంచి 10 మంది సర్పంచ్‌గా పోటీ చేసేందుకు సిద్ధవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీల మద్దతుతో పాటు మరికొంత మంది స్వతంత్రంగా ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. జనాభా ప్రతిపాదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అవకాశం ఉన్నందున కొన్ని స్థానాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు.

పోక్సో కోర్టు పీపీగా శ్రీనివాస్



శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం శ్రీనివాస్ బుధవారం బాధ్య తలు చేపట్టారు. తన నియమకానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు శ్రీనివాస్‌ను అభినందించారు.

ఎస్పీని కలిసిన పీపీ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మహోల్కర్ శ్రీనివాస్ బుధవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక వైద్య శిబిరాలతో మెరుగైన సేవలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సీతారాం

పెంచికలపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వస్థ నారి సశాక్త పరివార్ అభియాన్ పథకంలో బాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాలతో మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక ఎముకలు, కీళ్ల వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలని, తగిన వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆయన అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, డాక్టర్ తిరుమలేష్, డాక్టర్ హర్షిన్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

సిర్పూర్(టి), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కత్తెరసాలకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కత్తెరసాల డాక్టరేట్‌ను ఇటీవల అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం నుంచి డాక్టర్ రాం షెపర్డ్ పర్యవేక్షణలో నాలెడ్జ్ అండ్ ప్రాక్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ ఏ కంపరేటివ్ స్టడీ ఆఫ్ కన్జర్వేటివ్ అండ్ ఇంటెన్సివ్ ఫార్మర్ ఆఫ్ కుమరం భీం ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను శ్రీనివాస్ కత్తెరసాలకు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కెరమెరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం కరంజీవాడ గ్రామ పంచాయతీలో గత 20 సంవత్సరాలుగా కామాటిగా పని చేసిన మండడి కోను అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామ పంచాయతీ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.2200 ఆర్థిక సాయం బుధవారం అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, సంతోష్, భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పండుగ అడ్వాన్సు ఇవ్వాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌ఎం అన్ని విభాగాల వారదీగా డైస్, రేడియోగ్రాఫర్‌లకు కూడా పాత జీవో ప్రకారం పీఆర్‌సీ కలిపి జీతంతో పాటు పండుగ అడ్వాన్సులు ఇవ్వాలని డీఎంహెచ్‌వో కార్యాలయం సూపరింటెండెంట్ ఎండీ షఫియుద్దీన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, నాగేష్, ప్రవీణ్, లీద్య, షకీల్, జీవిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కౌటాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ హరికృష్ణ తెలిపారు. జైనూరులో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో కౌటాలకు చెందిన కార్తీక్, మనస్వీ, కీర్తన, దివ్య, సరిత, కావేరి అనే విద్యార్థులు ప్రతిభ చాటి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యా ర్థులను ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్ తదితరులు అభినందించారు.

కాగజ్‌నగర్‌లో దంచికొట్టిన వాన

కాగజ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం రాత్రి వర్షం దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. మహిళలు బతుకమ్మ ఆడకుండా వర్షం నీరు పలు కాలనీల్లో చేరింది. ప్రధాన కూడలిలో పలు చోట్ల రోడ్డుపై గుంతలు ఉండడం, వర్షం నీరు చేరడడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

పనులు వేగవంతం చేయాలి



కుమరం భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కెరమెరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో వచ్చే నెల 7న నిర్వహించనున్న భీం వర్ధంతి లోగా పనుల న్ని పూర్తి కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జోడేఘాట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతూ జోడేఘాట్‌లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భీం వర్ధంతి రోజు ఏర్పాటు చేసే సభాస్థలం, పార్కింగ్, భోజన స్థలాలను పరిశీలించారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు విశ్వనాథ్, లక్ష్మణ్‌రావు, కుసుంరావ్, ఆనంద్‌రావు, రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ సంతోష్

చింతలమానేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణే లక్ష్యంగా పని చేస్తున్నామని సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని రన్‌వెల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్థులకు సీఐ సంతోష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సోదాలు నిర్వహించి పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీల్లో 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబా స్వాధీన పర్చుకున్నామని తెలిపారు.

కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మెడికల్ కళాశాల విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలోతో పాటు కాగజ్‌నగర్ వసుంధర డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి కళాశాల అవరణలో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రయద ర్శిణి, విశాఖ, హెచ్‌ఈ లలిత తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ వసుంధర డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటలను ఆడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుడిక్యాల రాజమౌళి, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

రెబ్బెన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పోరుషోత్తం తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండు సమీపంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్సు వినియోగంలోకి రాక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు, నాయకులు స్పందించి ఈ కాంప్లెక్సును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బెజ్జూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం లక్ష కుంకు మార్చన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవై శ్య సం ఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లా డుతూ ఆర్యవైశ్య మహాసభ, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో జిల్లాలోని ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మహిళా కార్య నిర్వాహక సభ్యురాలు సిద్దంశెట్టి సుహాసినికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, సంతోష్, సందీప్, దామోదర్, మ హేష్, శ్రీవర్ధన్, రమేష్, సంతోష్, వెంకట రమణ, కిరణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన ఉద్యోగులు



బంగారు పతకాలు సాధించిన అనురాధ, మమత

రెబ్బెన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలో బుధవారం నిర్వహించిన కంపెనీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెల్లంపల్లి ఏరియా మహిళా ఉద్యోగులు బంగారు పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్ 57 కిలోల విభాగంలో అనురాధ, 47 కిలోల విభాగంలో కొట్నాక మమత ప్రతిభ చాటి బంగారు సాధించి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. అలాగే బాడి బిల్డింగ్ 75 కిలోల విభాగంలో జి.మొగిలి గోల్డ్ మెడల్ సాధించారు. అక్టోబరు 14 నుంచి 16 వరకు నాగ్‌పూర్ వేదికగా నిర్వహించే కోల్ ఇండియా స్థాయిలో పాల్గొననున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పనులు పూర్తి చేయాలని తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎస్‌ఈ షఫీ అన్నారు. బుధవారం జిల్లాలోని నిర్మాణంలో ఉన్న కేజీబీవీలు, భవిత కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఇంజనీరింగ్, విద్యశాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా బుధవారం పట్టణంలోని బజారువాడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, విటమినులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వాసుదేవ్, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, వరలక్ష్మి, పద్మ, పుష్పలత, లక్ష్మి, రూప పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనుల పరిశీలన



వాంకిడిలో పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శేషారావు

వాంకిడి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఎస్బీఐ బ్యాంకు నుంచి హనుమాన్ మందిర్ వెళ్లే దారిలో చేపడుతున్న విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులను ఎస్‌ఈ శేషారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఏరియాలో గతంలో విద్యుత్ స్తంభాలు ఇరుకుగా ఉండడం వల్ల విద్యుత్ తీగలు ఇబ్బందికరంగా మారి తరుచు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో స్తంభాలు తొలగించి విద్యుత్ తీగలను సవరిస్తున్నామన్నారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతిక పరంగా సౌకర్యంగా ఉండేలా టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ రూపొందించినట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందవచ్చని సూచించారు. 20 ఫీచర్లతో యాప్ రూ పొందించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 18004250028, 1912 అందుబా టులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఈ శేషారావు సూచించారు.

మున్నూరు కాపు సంఘం యూత్ కమిటీ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘ యూత్, జిల్లా హడ్‌హక్ కమిటీలను బుదవారం విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా వినోద్, ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్‌ను ఎన్నుకున్నారు. హడ్ కమిటీ సభ్యులుగా జక్కయ్య, శంకర్, నారాయణ, సత్యనారాయణ, తిరుపతి, రాజయ్య, శ్రీకాంత్, రాజయ్య, భాస్కర్, కిష్టయ్య, సాయి, సంపత్, శంకర్, సత్యనారాయణ, సతీష్, రామయ్య, రాజయ్య, రాజశేఖర్, కిరణ్‌కుమార్, శంకరమ్మను ఎన్ను కున్నారు. సంఘం బలోపేతానికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు.